


# మనసు చెప్పిన కథ

## తల్లావఝ్ఝుల పతంజలి

(1966 జ్యోతి మాసపత్రిక, సెప్టెంబర్, సంచిక నుంచి)




క్రొత్త ఇంట్లో పాత సంసారాన్ని సద్దుబాటు చేసే ప్రయత్నంలో ఉన్నాను. ఉన్నవారికి దూరంగా, తెలిసిన మనుషులకి ఎడంగా క్రొత్త ప్రాంతంలో పెద్ద ఊళ్ళోనే అడుగుపెట్టినా ఎందుకో ఇద్దరం ఏకాంతంగా ఉన్నామన్న అనుభూతి పోలేదు. చుట్టూ ఉన్న ప్రపంచం కంటే ఓ మెట్టుపైనో కిందో, మొత్తానికి దాంతో సంబంధం లేని చిన్న మరో లోకంలో విచిత్ర ఏకాంతవాసం కనీసం మా అనుభూతి. మొదటిరోజే పొయ్యి రాజెయ్యడం మన కిష్టం లేదు.

"పోనీ హోటల్నించి తెప్పిస్తాను, ఏం ?" అనేశాను.

"ఎందుకండీ ? చేసుకుంటే ఏంపోతుంది?"

అసలు సిసలైన భార్య అనవలసిన మాట తను అనేసింది. "మొదటి రోజే ఈ పొదుపెందుకులే ?" మొత్తానికి ఆమె శ్రమ పడ్డం ఇష్టం లేకపోతేనేమి. నాకు బజారు వెతుక్కుంటూ వెళ్ళి సరంజామా తేవడానికి బద్ధకంవల్ల అయితేనేమి ఓ ఉడిపి వంటవాడి హస్తపాకం ఆరంగించాం.

బడలిక వల్లా, ఏవో ఆలోచనలవల్లా, అన్నిటినీ మించి క్రొత్త స్థలం తాలూకు ఓ క్రొత్తదనం – వెరసి బద్ధకం. నిద్ర ఇత్యాదులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి నన్ను. లోపల సవరిస్తున్న సామాను మంచి లయతో మెల్లగా జోకొడుతున్నాయి. నిశ్శబ్ధంగా సమిధ వెలిగించి పడుకున్నాను. తను వచ్చింది. మాట్లాడే ఓపిక ఇద్దరికీ ఉన్నట్టు తోచలేదు.

సగం సగం సర్దిన సామానుల మధ్య, విశాలమైన గదిలో మంచాలు పరుచుకుని నిద్రారంభం చేసే ప్రయత్నాలు ఆరంభించాం. నాతో ఏవో కబుర్లు చెపుతూనే మెల్లగా కళ్ళు మూసుకుని త్వరలోనే సుషుప్తిలో మునిగిపోయింది నళిని. రెండు మూడు సార్లు పిలిచి ఊరుకున్నాను.

నాకు నిద్ర తాలూకు మగత తప్ప నిద్ర వచ్చే సూచనలు కనబడ్డం లేదు. బోర్లా పడుకుని ఏదో ఆలోచిస్తూ ఆమె వైపే చూస్తున్నాను ...

పెళ్ళై రెండు ఏళ్ళు దాటిపోయింది. అప్పుడే ఆమె ముఖంలో వివాహిత యొక్క ఓ విధమైన గాంభీర్యం, ఏదో హుందాతనం వచ్చాయి; చలాకీ తనం, చిలిపి తనం ఎటువటే మటు మాయమయిపోయి, బాధ్యతలు బరువును పుంజుకోక ముందే, ఆమెను చూడగానే, బరువు బాధ్యతల కోసం సంసిద్ధపడినట్టే కన్పిస్తుంది. బడలిక వల్ల మొహం కించిత్ వాడిపోయి ఉంది. సుఖ సుషుప్తి వల్ల దీర్ఘంగా ఆమె నిట్టూర్పులు విడుస్తూ తాత్కాలికంగా ఈ చరాచర ప్రపంచపుటంచులను దాటి వెళ్ళిపోయింది --- కళ్ళ కింద లేతగా, నున్నటి నలుపు ప్రసరించింది. శ్రమపడిన తరువాత ఓ విధమైన వింత సౌందర్యాన్ని ప్రదర్శిస్తారు ఆడవాళ్ళు. ఎందుకో చిన్న నవ్వు నా పెదవుల మీద నిలిచింది. మెత్తగా, సున్నితంగా చేత్తో ఆమె ముంగురులను పైకి నెదుతూ కపోలాలను స్పృశించాను. ఆలోచనలు, భావనలు ఎక్కడి వక్కడే కరొగొపోయాయి. నా కళ్ళు కూడా మెల్లగా మూతలు పడ్డాయి. అలాగే చెయ్యి ఆమె మీదకు జారవేసి, నేనూ నిద్రలో మునిగిపోయాను.

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

మెలకువ వచ్చి చూసేసరికి చెయ్యి ఖాళీ మంచం మీద విశ్రాంతి తీసుకుంటోంది. బరువుగా రెప్పలను ఎత్తి చూశాను. చుట్టూ అప్పుడే పరిశుభ్రంగా ఎక్కడివక్కడ అన్నీ సర్దేసి ఉన్నాయి. మెల్లిగా లేచి కీళ్ళను ఓసారి కిర్రుమనిపించి, బొంగురుగా పిలిచాను. కాఫీ కప్పుతో సహా ఎదురుగా వచ్చి నిలుచుంది నళిని.

"అయిందా నిద్ర? "

"ఎప్పుడయింది?"

"ఓ అరగంట కింద."

"అవున్లే, నీకు నిద్రా భద్రా ఎందుకు? అసలు ఓ పెద్ద సైజు మెషిన్ని పెళ్ళి చేసుకున్నాను."

"పాపం" నవ్వేసిందామె.

బాగా సాయంకాలం అయిపోయింది. నిద్ర విడిచిన ఉత్సాహం, బద్ధకం రెండూ మొహాన్నీ, ఆలోచనల్నీ చుట్టేశాయి. ఒంటరిగా బయలుదేరాను. కోలాహలం, రిక్షా గంటలు, పక్షం కిందట పళ్ళను, తాజావని కొనమని ఆహ్వానాలు, మొలతాళ్ళు, రిబ్బన్లూ వగైరాలు కేవలం ప్రజలకు దానం చేస్తున్నట్టుగా భావిస్తూ గొంతు చించుకోవడం – అన్నిటి మధ్యనుంచీ చొక్కా మీద వలసినంత ధూళి పేరుకోగా, ఓ గ్రంధాలయం తాలూకు చెరిగిపోయిన బోర్డు చూసి లోపల ప్రవేశించాను. పేపరు చదువుతూ కూచున్నాను. వెనక కిటికీలోనుంచి వాడీ, వేడి తగ్గిన సూర్య కిరణ పుంజాలు సున్నితంగా చెవుల మీద నుంచి బుగ్గలను తాకుతున్నాయి. పేపరు మడిచి కూచున్నాను. చుట్టూరా నిశ్శబ్దంగా ఉంది. గదిలో ఇద్దరు ముగ్గురికంటే లేరు. నా యెదుట కుర్రవాడు గుణించకుంటూ పిల్లల బొమ్మల భారతం పారాయణ చేస్తున్నాడు. మరొకాయన 'అశ్వమేధానికి' సంబంధించిన బొమ్మలను గమనిస్తున్నాడు.

ఆఫీసులో రేపు మన దర్శనం ఇవ్వాలి. వీలైతే మరో వారంరోజులు నిద్రపోదామని వుంది. పరిచయాలూ, స్నేహితులూ లేని ఊరు అరణ్యం లాగ ఉంది. అన్ని వందల మొహాలలో గతంలో దర్శించిన మొహం ఒక్కటీ కనుపించదు. మెల్లగా కళ్లు మూసుకుని, చేతులు కట్టుకుని అనవసర యోచనా సమాధి గదిలో ప్రవేశించాను---

ఒక్కసారి, చటుక్కున శరీరానికి చిన్న కంపం కలిగింది. బద్ధకం రెక్కలు వచ్చినట్టయి ఎగిరిపోయింది. మెదడులో, ఆలోచనల్లో ఒక్కసారి చిలికినట్టయింది. చప్పున కళ్ళు తెరిచి ఓసారి గడియారంవేపు చూశాను. ఆరున్నర దాటిపోయింది.

శారద ఇక్కడే ఉంది .. అవును. కనీసం ఇక్కడే ఉన్నట్టు జ్ఞాపకం. ఉదయంనుంచీ గుర్తురానందుకు నన్ను నేను శపించుకున్నాను. ఆమె పేరు గుర్తుకు రాగానే ఇంతవరకూ చెవులనూ, ఆలోచనలనూ వేధిస్తున్న కోలాహలాభరిత లోకం నా నుంచి వేల మైళ్ళ దూరం పారిపోయింది. అనిర్వచనీయ భావ తరంగాలు నన్ను వశపరుచుకున్నాయి. ఇదమిత్థంగా నేను ఆమె గురించి గానీ, ఆమె జీవితం గురించి గానీ ఏమీ ఆలోచించడం లేదు.

కాని నాకు తెలియకుండా మనసు పాత జీవితంలోకి సాగిపోయింది. ఓ ఆలోచన, భావపుంజాలు – గట్టిగా ఇదని నేను చెప్పలేను. ఆనందం? ఏమో, ఏదో, మొత్తానికి ఏదో కావాలనుకున్న ఆలోచన. మన పరిధుల నుంచీ దూరం కాకూడదని కోరుకునే ఓనిబిడభావ వితతి. ఏమి అనుకుంటున్నావో నాకు తెలియదు. ఆ అనిర్వచనీయయోచనా సమాధిలోనే హాయిగా ఉండాలనిపిస్తోంది.

వెచ్చటి ఆలోచనలు, మనస్సునీ, మెదడునీ సంపూర్ణంగా వశపరుచుకున్నాయి. మనిషి నిర్వచించలేని అనుభవాలను వెలువరించే సాధనం ఉంటే బాగుండును. గుండెలోని ఈ తియ్యటి అనుభూతి సంబంధమైన సాంద్రతను కొలిచే సాధనం ఉంటె బాగుండును. ఏదో, చేతినుంచి జారిపోయిన అనుభవం, దూరం అయిన భావన, మళ్ళీ ఒకనాటి అధికారం, తద్వారా అహంకార నమ్మిళితమైన ఆనందం, బాధ కూడా – అన్నీ సన్నటి మబ్బు తెల్లా నన్నూ మనస్సునీ సున్నితంగా పెనవేసుకు పోయాయి. నేను పూర్తిగా లోబడి పోయాను. ఆలోచనలను దూరం చేసుకుందామని ప్రయత్నించలేదు. అలాగే కూచుని, కళ్ళు మూసుకుని నాకు తెలియని, చెప్పలేని వెచ్చటి భావపరిధుల్లో ఉండిపోయాను. ఎందుకో నాకు ఆ లోకం నుంచి బయటపడాలనిపించలేదు; ఇష్టంలేదు.

శారద ... అదే ... నేను పేరు తప్పించీ, నిజానికి ఆమె రూపం కూడా జ్ఞప్తికి తెచ్చుకోవడంలేదు. ఆమె పేరు, దానితోపాటు సహస్ర అనుభూతి పరంపరలు నన్ను ఆ పైన ఆలోచించనీయకుండా చేసి వేస్తున్నాయి. శ్రమించి నా మనసు కూడా మరేమీ గుర్తు చేసుకునే ప్రయత్నమూ చెయ్యడంలేదు. కల – భావన – ఊహ – అన్నీ !

బాగా చీకట్లు పరుచుకున్నాయి. నేను లేచేసరికి బొమ్మల భారత పారాయణ ముగించి కుర్రవాడు ఎటో పారిపోయినా, అశ్వమేధ సోమయాజి మాత్రం అతి జాగ్రత్తగా, ఆశ్చర్యకరమైన శ్రద్ధతో అటూ ఇటూ బొమ్మలను తదేకంగా పరిశీలుస్తున్నాడు. లేచి బయటకు నడిచాను. వీధులనుండా దీపాలు వెలుగుతున్నాయి. కాళ్ళు పెద్దగా నా ప్రయత్నం లేకుండానే గుర్తు చేసుకుంటూ ఇంటివేపు నడిచిపోతున్నాయి. గుమ్మం దగ్గిరే, నా కోసమే కాబోలు ఎదురుచూస్తూ నళిని కనిపించింది ..

“నయమే, ఇల్లు గుర్తుంచుకుని మనింటికే వచ్చారు. మరో ఇంటికి ఉడాయించారు కారు – రండి, దయ చెయ్యండి.

నవ్వుతూ లోపలకు అడుగు పెట్టాను – వెనకాల తలుపు వేసిన శబ్దం అయింది.

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

ఉదయం, ఇంకా ఆఫీసు అడప తొక్కకుండానే ఎప్పుడు ముగుస్తుందా అని ఆలోచించేస్తూ, స్నానయజ్ఞం, భోజనయజ్ఞం, వీడ్కోలు వేడుక, వగైరా రెండేళ్ళనుంచీ అలవాటయిన ఆనవాయితీ తోరణాలను దాటుకుని, రిక్షా యొక్కి దానికంటె ముందు ఆలోచనలతో ఆఫీసువేపు బయలుదేరాను.

పని చేయించే బాధ్యత తప్పించి, చెయ్యవలసిన ఆగత్యం లేకపోవడంతో మళ్ళీ నన్ను ఆలోచనలు ముసురుకున్నాయి.

మా అవసరాలకు నాన్నగారి వేపు ఎన్నడూ అభ్యంతరాలు రాకపోగా, అమ్మ మమ్మల్ని వెనక్కు వేసుకొచ్చే ఆసరా ఉండగాఎన్నడూ బరువు భాద్యతల బాధలు తలపుకు రాని భూతకాలంలో నేను బి.యే. వెలగపెడుతుండే వాణ్ణి. ఇంట్లో, బయటీ కూడా వలసినంత స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఎన్నడూ నానుంచి దూరం కాలేదు. అప్పుడూ, ఇప్పుడూ కూడా.

నాన్నగారు, పిత్రార్జితానికి మరి కొంచెం కలపడం వల్ల స్వగృహం అంటూ ఒకటి ఉండేది మాకు. మేం కాక మరో ఒక మాదిరి సైజు కాపురం ఉండ తగ్గదిగా ఉండేది – ఎప్పుడూ ఏదో ఒక పొరుగు .... సరిగ్గా ఎప్పుడు బి.యే.లో చేరేనో ఇంకా మర్చిపోకముందే, మూడేళ్ళు మమ్మల్ని వెనక పడవేసి గబగబా ముందుకు సాగిపోయాయి. పరీక్ష గట్టు కీడ్చిం తరువాత పై చదువు సమస్య చర్చించడంతోనే సగంపైగా కాలం వ్యర్థం అవడం వల్లా, తరువాత అమ్మ అభ్యంతరాల వల్ల సగం, వగైరా చిల్లర కారణాలన్నీ కలగలసి మన యం.ఎ.విద్యాభ్యాసం ఓ సంవత్సరం వెనక్కూ ముందుకూ ఊగి, చివరకు వనకే ఆగిపోయింది – కాబట్టి చూడవలసిన వ్యవహారాలు లేక పూర్తిగా ఖాళీగా ఉండిపోయాను.

ఇంకా మూడు నెల్లు గ్రీష్మం ఉందనగానే, ఏదో స్నేహితుడి వెళ్ళికని చల్లగా నాన్నగారికి నచ్చ చెప్పవలసిన బాధ్యత అమ్మమీద వదిలేసి జారుకున్నాను. పెళ్ళి పేరున నాలుగైదు రోజులూ ఇంటినీ పరిసరాల్నీ మర్చిపోయి, నూత్న వధూవరుల్ని ఏకాంతానికి వదిలివేసి ఆఖరికి మిత్రబృందం అందరం తిరుగుముఖం పట్టాం.

చాలాకాలంగా అప్పటికే కారణాంతరాల వల్ల పక్క భాగానికి వేసి వున్న తాళం అదృశ్యమవడం చూస్తూ మెల్లగా లోపలకు అడుగు పెట్టాను. చెప్పిన, ఒప్పుకున్న, కాలం కంటే ఆలస్యంగా వచ్చిన కారణాలు సాధ్యమైనంత వరకూ ఊహించి చెపుతూ, స్నానం ముగుంచుకుని, చెవిలో తేమను తువాలుతో తుడుచుకుంటూ ఇంట్లోకి అడుగు పెడుతూ ...

"అమ్మా, నాన్న ఉత్తరం రాసేరేవ్."

ఎక్కడ నుంచో ఆడగొంతు అందులో అమ్మాయి కంఠస్వరాన్ని నా చెవులు వెంటనే పట్టేశాయి. ఒక్క క్షణం నుంచుని గబగబ లోపలకి వెళ్ళాను.

పచ్చడి కలుపుతూ అన్నాను. "అమ్మా, పక్కన ఎవరైనా చేరారా ?"

"ఆ. ఆయనకు ఏదో – అదేం ఉద్యోగం చెప్మా ..." తన జ్ఞాపక శక్తిని తిట్టుకుంటూ అంది అమ్మ.

"ఎప్పుడూ కేంపుల మీద ఉంటాట్ట. నువ్వెళ్ళిన రోజే చేరాను. చాలా మంచి కుటుంబం."

నిజానికి నాకు వారి కుటుంబం నుంచి మర్యాదల మీద కన్నా, నా చెవులు విన్న కంఠస్వరం తాలూకు యజమానురాలు ఎవరనే ఉత్కంఠే ఎక్కువగా ఉంది. కానీ నిశ్శబ్దంగా భోజనం ముగించి ముందు హాల్లో ఏదో పుస్తకం తెరచి కూచున్నాను.

"అమ్మా, నే కాలేజీకి పోతున్నాను."

మళ్ళీ అదే స్త్రీ కంఠస్వరం పారాహుషార్ వినిపించింది. చదువువేపున్న నా ఏకాగ్రత చెదరి కళావికలై పోయింది. చిన్నగా ఓ సారి దగ్గి వరండాలో వెళ్ళి నిలుచున్నాను. అప్పుడే, రోజారంగు బట్టల్లో ఉన్న ఓ తెల్లటి మధ్యరకపు టెత్తు ఆకారం నా కళ్ళ చివరల్ని దాటి వెళ్ళిపోయింది. ఏదో సుగంధ పరిమళాల్ని మాత్రం నాసికా పుటాలకు అందించి. మళ్ళీ చదువు... మొత్తానికి వరసగా రెండు రోజులామెను నేను చూడ్డం జరగలేదు. నే హాల్లో ఉండగా అమ్మ కంఠం పక్కనే కిలకిలమనే నవ్వు తాలూకు శబ్దం, ఇంట్లో కూర మాడిపోతోందనో, స్నానానికి పోతున్నాననో అందచేసే పారాహుషార్లు తప్పించి, నాకు ఆ అశరీరవాణి దర్శనం కాలేదు. కానీ పొరపాటున కూడా అమ్మతో ఆ మాట నేను ఎత్తులేదు.

నేను వచ్చి వారం గిర్రున వెళ్ళిపోయింది. హఠాత్తుగా, పదకొండు గంటల తర్వాత ఉదయం అశరీరవాణి వినిపించింది. ఏదో హిందీ పాటను పునః పలుకుతూ, వెంటనే కళ్ళు క్యాలెండరుమీదకి పోయాయి. ఆదివారం ! ఎందుకో ఆనందం .. గబగబా వెళ్ళి మొహం కడుక్కుని, సరిగ్గా తల దువ్వుకుని వచ్చి మళ్ళీ పక్షం క్రితమే వదిలేసిన పుస్తకం పట్టుకుని కూచున్నాను. అమ్మ వంటింట్లో ఉంది. తెలియకుండానే పుస్తకంలో మునిగిపోయిన నన్ను మళ్ళీ అశరీరవాణి మేలుకొల్పింది.

"ఏం చదువోనండీ. ఫైనలియరన్న పేరేగాని అన్ని సబ్జక్టులు మర్చిపోయాను. ఖర్మ అవును గానీ మనకి సొజ్జప్పాలు చేసి పెడతానన్నారు. మాటదాటేయ కండి – నాకు గుర్తుందిలెండి" కిలకిలలు.

చనువు చాలానే ఉంది. నాకు పుస్తకం మీద ఏకాగ్రత ఎన్నడో మసి అయిపోయింది.

"చూడమ్మా శారదా ! హాల్లో టేబిలు మీద కొత్త పత్రిక ఉంది. పట్రా."

అమ్మకి మనసులో తొలిసారిగా చాలాసార్లు నమస్కారాలు పెట్టాను. ఎవరో వ్యక్తి వస్తున్న ఛాయలు కనుపించాయి. చీర తాలూకు గరగరలు...చటుక్కున వెళ్ళి టేబిలు ముందు నుంచుని, సొరుగు గాలించడం ఆరంభించాను. గాజుల చప్పుడు గుమ్మం దగ్గిర ఆగిపోయింది. సొరుగు మూసి వెనక్కు తిరిగాను.

"పత్రిక ..." ఒకటి రెండు క్షణాలు తటపటాయించి సున్నితంగా అడిగిందామె.

"ఆహా – తీసుకోండి" నవ్వుతూ ఆమెకు అందించి. ఆచేతనంగా కుర్చీలో కూచుండి పోయాను శారద! మంచి పేరు తెల్లటి ఆకారం అనంతాకాశం విరిగి కిందపడ్డా పరుచుకోగల కళ్ళూ – మెత్తదనం తియ్యదనం కాదు గానీ మళ్ళీ ఓసారి వినాలనిపించే కంఠ స్వరం వెరసే ఆమె.

రోజులు గడిచిపోతున్నాయి పెద్దగా చనువు ఏర్పడకపోయినా శారద మొదట్లోలాగ నా తాలూకు ఛాయలు కనుపిస్తే అదృశ్యమవడం లేదు కంఠస్వరం మాత్రం తగ్గుతోంది. నేను కూడా సాధ్యమైనంత వరకూ అమ్మ మాటల మధ్య స్నానాల గదివేపు వస్తూనో వెడుతూనో ఏదో ఒక ఛలోక్తి విసిరి మరీ వెడుతూండే వాణ్ని.

మధ్యాహ్నం పన్నెండు గంటలైంది. లేచి బయటకు వెళ్ళి కాంటీన్ కాఫీ తాగి వచ్చి కూచున్నాను తలంతా బరువుగా ఉంది. బద్దకంగా కదలడానికి ఇష్టం లేని స్థితిలో ఉన్నాను. వచ్చిన రెండు మూడు కాగితాలు చూసి అవసరమైన హుకుం జారీ చేసి మళ్ళీ కుర్చీలో జారగిల బడ్డాను.

జీవితంలో కొన్ని కొన్నిటిని కొన్ని కారణాల వల్ల చూస్తునే పోగొట్టుకుంటూంటాము. తెలిసి చేజారిన పెన్నిధిని చూస్తే బాధగా ఉంటుంది కానీ చెయ్యి దాటిన తర్వాత విలువను గుర్తించిన వేదన వర్ణనాతీతం. మనసుకి సంబంధించిన ఓ విధమైన బలహీనం భయం ఇత్యాదులు కళ్ల యెదుట కనుపించే విషయాల్నే దాటవేస్తాయి పునశ్చరణ చేసుకున్న తరువాత. కలిగే బాధకంటే సరిగ్గా ఆలోచించి గమనిస్తే ఓ విధమైన గర్వమే మిగులుతుంది.

నాకు సంబంధించినంతవరకూ సరిగ్గా ఇలాగే జరిగింది. ఆశించడం మనవంతు, ఆశ పెట్టడం మనవంతు. కానీ వీటన్నిటి కంటే ముఖ్యమైనది మరొకటున్నదన్న సంగతి నేను తరచుగా విస్మరించాను. స్త్రీలకు సంబంధించినంతవరకూ నేను పెంచుకున్న ఆలోచనలు అదోలా, ఉండేవి. విలువైన వాటివేపు ఆశగా చూడ్డం మానవ సహజం. అందమైన ప్రతి స్త్రీ వేపు కళ్ళు పెద్దవి చేసుకుని చూచినంతగా, చేరువకు వచ్చినపుడు చొరవ చెయ్యడం అంత సులభం అనుకోను.

రోజులు గడిచిపోయాయి. బాగా పరిచయం, దాంతో పాటు మనం గమనించకుండా పెరిగే చనువు అన్నీ వలసినంతగా వృద్ధి అయ్యాయి. ఆయన చాలా మర్యాదస్తుడు. నెల అంతటికీ ఓ వారంకంటే సంసార సుఖం ప్రసాదించలేదు ప్రభుత్వం ఆయనకి. నిత్య కార్యక్రమంతో ఊరూరా తిరుగుతూ కాలక్షేపం చేస్తూండేవాడు.

అమ్మ ఇచ్చిన చొరవ వల్ల అయితే నేమి, శారద ప్రార్థనవల్ల అయితేనేమి ఆమెకు నేను గురుత్వం వహించక తప్పలేదు. రోజూ ఆమెకంటే నేను శ్రద్ధగా టైముకల్లా సిద్దంగా ఉండేవాణ్ణి. పాఠాలు ఆరంభించి సగం కాకముందే కబుర్లతో మిగతాకాలం పూర్తి అవుతూండేది. పాఠాలు, లెక్చరర్ల అలవాట్లు కాలేజీని చాలా కాలంగా పట్టుకు పీడిస్తున్న మాకు తెలిసిన దుష్టశక్తులు వగైరాలు మాత్రమే మా ప్రసంగ సారాంశాలుగా తరుచుగా ఉండేవి. ఎందుకో, తనలో నేను చాలా తెలివిగల వాడిననే నమ్మకం పూర్తిగా ఏర్పడిపోయింది. నా మేధ మీదా తెలివి మీదా ఆమెకెందు కంత అచంచలమైన విశ్వాసం కుదిరిందో తెలియదుగానీ, తన్ను తాను నాతో పోల్చుకుని తరచుగా కించ పరచుకుంటూండేది. "నీకేం తెలివిగల వాడివి ..." సహజంగా, మొదటినుంచీ ప్రతి విషయాన్నీ చమత్కారంగా చెప్పే అలవాటున్న నన్ను – నేను ఎప్పుదు మాట్లాదుతున్నా. కదిలించకుండా, అడ్డురాకుండా, కొంచెంగా నవ్వుతూ శ్రద్ధగా వినేదామె. నా మనోనేత్రాలు మాత్రం ఆమె కళ్ళలో మెరుపునూ, నవ్వుతున్నపుడు పెదవుల దగ్గిర వంకరలు తిరిగే సున్నితమైన గీతలను తదేకంగా గమనిస్తుండేవి. కళ్ళు తెరచి ఎన్నడూ తనని నేను సూటిగా చూడలేదు.

పాఠం చెపుతూ రెండు మూడు క్షణాలు అప్రయత్నంగా నా చూపులు ఆమె విశాల నేత్రాలలోకి జొరబడినా, అక్కడి చురుకు దనం, వాడిదనం, మళ్ళీ వెనక్కి తరిమేసేవి. కనురెప్పలు నిస్సహాయంగా టకటకలాడి, చెపుతున్న వాక్యం మధ్యలోనే ...

"ఏం మేస్టారూ డెక్కెట్టేసింది!" చిలిపిగా అన్నదామె.

"పట్టక ?" కళ్ళూ చూపులూ మాత్రం మళ్ళీ ఆమె నేత్ర సముద్రంలో మరి ములగ లేదు.

పాఠాలు చెబుతున్నాను; ఆమె వింటోంది. చనువుగా, తెచ్చుకున్న కోపంతో ఆమెను మందలించాను; ఆనందంగా ఆమె విదిలించేసింది; ఛలోక్తులు విసిరాను, 'ద్విగుణీ కృతమైన మెరుపుతో, చురుకుతో నాకు తగలగా అనుభవించాను – చూపులను మాత్రం మళ్ళీ ఆ విశాల నేత్రాల తాలూకు ఒరిపిడికి బలి చెయ్యలేదు; లేక, చెయ్యలేక పోయాను. కళ్ళు ఎత్తి సూటిగా, బహుశా ఆమెను చాలా తక్కువ సార్లు చూసి ఉంటాను. తల వంచుకున్నా, చూసినా చూడక పోయినా, లేక తను నన్ను చూడకపోయినా నా కళ్ళముందూ, మనస్సుముందూ శారద మాత్రం నవ్వుతూ నిలిచిపోయింది. చనువు పెరిగినా, పరిచయం నలిగినా, నా కళ్ళూ చూపులూ మాత్రం ఆమె పెద్ద కళ్ళ కాట్లను భరించలేదు. అందువల్లే బహుశా నా చూపులు ఆ కళ్ళలోని భావాలన్నీ చదవలేకపోయాయి, నా కళ్ళు ఆమె నేత్రాంచలాల్లో స్ఫుటంగా కనుపిస్తున్న అందమైన కాంతిరేఖల్ని వెతుక్కోడంలో పూర్తిగా ఓడిపోయి గాయపడ్డాయి. మనసునిండా శారద; ఆలోచనలన్నీ ఆమెవి; ఒక్క నా చూపులు తప్ప – అప్రయత్నంగా కూడా అవి నన్ను ఏమరచి పారిపోలేదు ...

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

అతని పేరు గుర్తు చేసుకుంటూ, కొద్ది శ్రమతోనే ఇల్లు గుర్తించాను. సాయంకాలం గడిచి పోయింది. కళ్ళు నలువైపులా చూస్తూండగా ఓ అందమైన చిన్న ఇంటి ముందు తటపటాయిస్తూ నా కాళ్ళ జత ఆగిపోయింది.

ముందుగేటు తోసుకుని చిన్న తోటలాటి ప్రదేశం మధ్యనుంచీ వరండాలో అడుగుపెట్టాను. ఎందుకో శరీరం యావత్తూ జ్వర చిహ్నాలు పొడచూసినట్టుగా వెచ్చగా అయింది. నరాలన్నీ వింతగా, బలంగా లాగి పట్టినట్టు అనుభూతి పొందాను. లోపల్నించి ఎవరిదో పాదాల శబ్దం వినబడింది.

గుండె ధడ్ మంది ఒక్కసారి. ద్వారంవేపే  సన్న సవ్వడి పాకివస్తోంది – శరీరం కొంచెంగా జలదరించింది; రెప్పలు టపటపమన్నాయి. ద్వారానికి వేలాడుతున్న తెరకింద నుంచీ ఓ జత పాదాలు కనుపించాయి.

తల ఎత్తి చూశాను – ప్చ్ !

“అమ్మగారున్నారా?” గొంతులో ఏదో మార్పు స్పష్టంగా నా చెవులకే కొత్తగా వినబడగా, ఎదుట నుంచున్న పనిపిల్లను అడిగాను.

“బాబుగారు అమ్మగారు సినిమా కెల్లారండి – ఒస్తే ఏం చెప్పమంటారు?”

అతిధులనూ, అగంతకులనూ ఆహ్వానించడానికి అలవాటు పడ్డట్టున్న ఆమె మాటలు నా సమస్యల్ని సగం చేధించాయి. మొత్తానికి యిల్లు కనుక్కున్నాను. వార్త వినగానే నరాలన్నీ సడలిపోయాను. నీరసంగా ఆమె వేపు చూశాను. పేరు చెప్పి వెడదా మనుకున్నాను. వెంటనే ఎందుకో ఆ ప్రయత్నం ఆపేసి “ఏం వద్దులే – మళ్ళీ వస్తా”నని గేటు వేపు నడిచాను. గేటు దాటుతూండగా తలుపు వేసిన శబ్దం విన్నాను.

కొత్త పరిచయం, స్నేహం చేసుకుందామనే ఉద్దేశంతో అనుకుంటాను. ఆగి ఆగి మాట్లాడుతున్న ఓ ఇద్దరు పక్కిళ్ళ తాలూకు మధ్య వయసు గృహిణుల సంభాషణలను అనిష్టంగా వింటూ, అనుకోకుండా వచ్చిన నన్ను పూర్తిగా కళ్ళు ఎత్తకుండానే చూస్తున్న నళిని చూపులను తప్పించుకుంటూ, నిశ్శబ్దంగా మేడమెట్లు ఎక్కి, గదిలో పడక కుర్చీలో నీరసంగా వాలి పోయాను.

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

గుండెమీద చెయ్యి వేసుకుని గట్టిగా శారద అంటే నాకే అభిప్రాయం ఉందో ఎక్కువగా నేను ఆలోచించలేదు. నా మనసు ఒప్పుకోలేదు. ఇంకా చెప్పాలంటే భయపడింది. చర్మానికీ, మాంసానికీ సంబంధించిన కొన్ని అనివార్య అవసరాలకు అందమైన పేర్లు ఏవో పెట్టి నన్ను వంచించుకోవడం నాకు ఇష్టం లేదు. కానీ తదాలోచన ఏ మూలో నా మనస్సులో పాకినప్పుడు మాత్రం వెన్నుమీద చరచినట్టయి ఆత్మవంచన కుపక్రమించాను.

శారద బావుంటుంది – తెలివి తక్కువది కాదు. అయినా చర్మానికీ, మేధకీ సంబంధం లేదు – అక్కర్లేదు. నాకు ఎందుకోగానీ మరో ఆలోచన ఎప్పుడూ రాలేదు. తన అభిరుచులు, ఆశయాలు వగైరాలు నా మనసుకు పెద్దగా పట్టలేదనే చెప్పాలి. మనిషి జీవితంలో జారుడుమెట్లు --- ప్రతి సామాన్యమైన మానవ చర్మానికీ సంబంధించిన ఆలోచన, ఆశ, నేడే అప్పట్లో నాకు సోకాయి – నలుగురికీ ఉన్న చర్మ కవచమే మన మాంసాన్నీ, రక్తాన్నీ కప్పి ఉన్నప్పుడు, వాటి మీదకు దాడి చేసే నిప్పు రవ్వలను లేవనుకొని, ఓ మెట్టుమైన ఉన్నామని అనుకోవడం లాటి ఆత్మవంచన – బహుశా సహజమేమో. ఎందుకో ఇంత ఉధృతంగా నాలోచెలరేగిన కోరికల దాటి ఎన్నడూ పెదాలనూ, మనసునూ, ముఖ్యంగా కళ్ళనూ చేధించుకుని బయట పడలేదు. నా లోపలే మిగిలిపోయాయి.

ఈ అనుభవం అసాధారణమైనదీ, అసంభవమైనదీ కాదు. ప్రతి అందమైన కళ్ళ జతా, ముచ్చటైన చిరునవ్వూ సామాన్యులలో రేపే అలజడే కావచ్చును. అయింది కూడా. ఈ నా ఆలోచనలు, ముగింపూ అన్నీ కూడా శారద ప్రదర్శించిన ఒకనాటి వింత ప్రవర్తన ఫలితాలనే చెప్పాలి. నాలో, నా మనస్సులో ప్రభవించిన కెరటాలన్నీ ఆమె కళ్ళకు సంబంధించిన ఒక చల్లటి దృక్ప్రభావం. నేనూ, నా మెదడూ ఊహించ లేని ఆ వింత పరిణామం, హఠాత్తుగా నేను ఎదుర్కొన్న తరువాత చాలా కాలం ఎందుకో నా మనస్సు కడిగినట్టుగా లేదా, మడతలలో నాకు తెలిసో, తెలియకుండానో ఇమిడిపోయి ఉన్న కశ్మలాన్ని బలవంతంగా మనో నేత్రం ముందు నిలిచింది చూశాను – తరువాత కొంత కాలానికి నేను ఆ వేడి నుంచీ, ఉధృతాన్నుంచీ దాదాపు నన్ను దూరం చేసుకొన్నాను; ఇంకా సరిగ్గా చెప్పాలంటే అవే పారిపోయాయి.

ఎందుకని గానీ, ఎలా జరిగిందని కానీ నేను ప్రశ్నించుకోలేదు; ఊహించనూ లేదు. బహుశా నాకు తరువాత స్ఫురించిన ఒక నిజం సమాధానంగా నిలవడం వల్ల కావచ్చును. సామాన్యమైన అనుభూతులూ, ఆవేశాలూ, వేడీ మనిషినీ మనసునూ సామాన్యంగా బాధించేవీ, చుట్టుకునేవీ, అప్పట్లో వాటి ప్రభావం మన మీద ఉన్నంతగా, కొంత కాలం తరువాత క్రమంగా వాటి వేడినీ,  వాడినీ కోల్పోతాయి. ఒకనాటి అనంత కోటి యోచనా శరాలు మన్ని భావించినా, ఒకప్పుడు శతకోటి ఆలోచనా స్రవంతులు మనిషిని మునకలు వేయించినా, తాత్కాలికమైన ఈ అలజడి నుంచి మనసు తేరుకోవడానికి ఎక్కువ కాలం పట్టదు.

ఇలాగే జరిగింది సరిగ్గా. జరుగుతుందని నాకు తెలియదు, ఒకవేళ నా హృదయంలో ఏ మూలో నాలు తెలిసినా, మెదడు జ్ఞానేంద్రియాలకు తెలియచేసేంతగా తెలియదనే నా నమ్మకం --- మొత్తానికి ఒక రకమైన శోధనకు గురి అయ్యానని చెప్పక తప్పదు.

చాలా మంది మధ్య తరగతి కుటుంబ  ఆర్థిక జీవితానికి సంబంధించిన సమస్యలే, శారద చదువును కూడా ఆ సంవత్సరంతో అంతం చేశాయి. నాకున్న చనువువల్లా, పరిచయంవల్లా ఆమెకు ఇంకా ముందు చదవాలనే కోరిక ఉన్నట్టు గమనించడం కష్టం కాదు. స్త్రీ జీవితంలో లేక అమ్మాయిల జీవితాల్లో ఇటువంటి ఒక ముగింపు – ఒక దశకు సంబంధించిన ముగింపు. తరువాత సామాన్యంగా వివాహం, సంబంధాలు వగైరాలూ ప్రవేశం, నిష్క్రమణ, మనస్తాపం అన్నీ తరచుగా జరిగే విషయాలే.

శారదను చూడ్డానికి ఎవరూ రాలేదు. అంతకుముందే, బహుశా ఆమె చిన్నప్పటినుంచీ, తన అంగీకారంతో గానీ, ఇష్టంతో గానీ, సంప్రతింపులతో గానీ సంబంధం లేకుండా ముడివేయబడ్డ ఈ బాంధవ్యం, శారద జీవితంతో కూడా శాశ్వతంగా ముడివేసే ఆలోచనలు జరిగాయి. ప్రతీ చిన్న పరిణామం నేను అమ్మద్వారానో, శారద తల్లి ద్వారానో వినేవాణ్ని.

శారద పెళ్ళి ... నాలో ఏదో తెలియని బాధ – అనే చెప్పాలి. చాలా సంప్రతింపుల తరువాతా, మాటల తరువాతా, అనుకుంటున్న సంబంధం నిశ్చయించడం, వేగంగా ముహూర్తాలు పెట్టించడం జరిగిపోయింది. నేను మాత్రం నాలో పెరుగుతున్న వింత బాధను గమనిస్తూనే ఉన్నాను .. అతను డాక్టరు. శారదకు కూడా ఈ సంబంధం ఇష్టంలేదు అని నాకు అనిపించలేదు. ఓ రోజు ఆమె అంత పెద్ద కళ్ళనూ సగానికి మూసి, మెల్లగా వరుడి గురించిన వివరాలు చెప్తుంటే, ఆమె కంఠ మార్దవంలో నా చెవులకు తన అంగీకారం స్పష్టంగా ధ్వనించింది.

"మరి నా పెళ్ళికి ఉండవా ?"

హఠాత్తుగా శారద అడిగింది. సమాధానం వెంటనే రాలేదు నా వేపు నుంచి. అంతకుముందే అనేక సార్లు చేసిన ప్రయత్నాల్లో ఒకటి – మరొకటి కలుపుతూ,  నేను కళ్ళు ఎత్తి ఆమెను చూడడానికి ప్రయత్నంచాను. అనుకోకుండా మరల్చిన ఆమె చూపులు, మళ్ళీ మామూలుగా నా దృక్కులను గాయపరిచాయి ... కనురెప్పలు టకటక లాడాయి.

వింతగా నవ్వుతూ అన్నాను.

"ఎందుకుండనూ ? ... ఉండమంటావా? " –

నాకు మాట్లాడాలనిపించలేదు.

అచ్చయి వచ్చిన శుభలేఖను చూస్తూ కూచున్నాను నేను. అతన్ని చూడలేదు నేను. ఆమె నోటివెంట వినలేదు. బహుశా వినడం కూడా నా మనసు ఉద్దేశం కాకపోవచ్చును. నేను అడగలేదు; శారద చెప్పలేదు. ఆమెలో నాకు మార్పేమీ కనుపించలేదు. నా పరిచయానికి సంబంధించినంతవరకూ, నా కిష్టమైన మార్పును ఆశించానో లేదో నా కయితే తెలియదుగానీ,  తెలిసినంతవరకూ మార్పు లేకపోవడాన్ని మాత్రం నా బెదురు కళ్ళు గమనించాయి – బుర్ర అవగాహన చేసుకుంది.

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

భోజనం ముగించి నా చిన్న గదిలో కూచున్నాను. పెళ్ళి దగ్గిర పడ్డంవల్ల పక్క వాటాలో శారద తండ్రి చీరలకు సంబంధించిన సమస్యలను ఆమెతో తీవ్రంగా చర్చించడం నాకు అస్పష్టంగా వినవస్తోంది. కాళ్ళు మేజామీద బారచాపి, అప్రయత్నంగా ఎదురుగా ఉన్న శుభలేఖను తీసి చూశాను. బంగారు రంగు అక్షరాల్లో వధూవరుల పేర్లు గమనిస్తూ అలాగే చాలాసేపు నాకు తెలియని ఆలోచనలు చేస్తూ ఉండిపోయాను. నాన్నగారు ఏదో పార్టీకీ వెళ్ళి ఉండడంవల్లా, అమ్మ దొడ్లో ఏదో పనిమీద ఉండడంవల్లా నా ఏకాంతానికి భంగం కలగలేదు.

రాత్రి దరిదాపు తొమ్మిది దాటుతోంది. దొడ్డి వసారా లోంచి సరిగ్గా మాటలు వినిపించడంలేదు గానీ మొత్తానికి అంత ఏకాంతాన్నీ, ఆలోచనల్నీ శారద కంఠం భగ్నం చేసింది.

"ఈ రంగా? – నాకు అదే బాగుందండీ .."

ఒక వేళ నేను అంతవరకూ ఆలోచనా ప్రపంచంలో ఉంటె వెంటనే ఇహంలో పడ్డాను.

సన్నగా అడుగుల చప్పుడు వినబడింది. గుండెలో ఏదో బలంగా కలుక్కుమంది. సవ్వడి వంటింట్లోంచి నా గదివేపు రావడం వినడం తోటే అమిత విశ్వాసంతో నా కళ్ళు గుమ్మంవేపు దృష్టి సారించాయి.

"కూచో." ఎదుటి కుర్చీని చూపిస్తూ నవ్వడానికి ప్రయత్నిస్తూ కాళ్ళు టేబిలు మీదనుంచి తీసి సరిగ్గా కూచున్నాను.

"ఏవిటి విశేషం?" నిజానికి మాట్లాడకుండా అలాగే మౌనంగా ఉండాలనిపించినా తప్పులేదు. కళ్ళు ఎత్తి చూడబోయి, మానుకుందా మనుకుంటూండగానే నాకు తెలియని వింత ధైర్యం, చొరవ నన్ను ఆక్రమించుకున్నాయి. మెల్లిగా కళ్లు ఎత్తి చూశాను. కనురెప్పలు టకటక మన్నాయి. అంతకు ముందు నుంచే ఆమె పెద్ద కళ్ళలోంచి వెలువడుతున్న అసంఖ్యాకమైన చూపులు నన్ను చకితుణ్ణి చేశాయి. కొన్ని క్షణాలపాటు ఆమెకళ్ళ లోతుల్లో నా చూపుల్ని పారవేసుకున్నాను. నాకు తెలియకుండానే, సరిగ్గా నా అనుభూతి విప్పి చెప్పాలంటే మనస్సునూ, గుండెనూ భేదించి పరిశీలించినా చెప్పలేనేమో. గంభీరంగా, లోతుగా, మెత్తగా, తదేకంగా చూస్తున్న ఆమె పెద్ద కళ్ళనిండా సన్నటి నీటిపొరలు కమ్మడం చూశాను. గుండె హఠాత్తుగా ద్విగుణీకృత శబ్దం చేస్తూ, రక్తప్రసారాన్ని వేగం చేసింది. శరీరం ఉష్ణతను పుంజుకోవడం, కొద్దిగా కంపించడం నాకు తెలియకుండానే జరిగిపోయింది. హఠాత్తుగా నా చూపులు పదునెక్కాయి. మరో రెండు క్షణాలు ఆమె కళ్ళలోకి చూస్తూవుండిపోయాను. నీరు నిండిన — కన్నీటి పొరల్లోంచి వెలువడిన ఆమె చూపులు నా హృదయం అట్టడుగు పొరవరకూ చిలికి, కెలికి వేశాయి. అలాగే చూస్తూ, ఆ అనుభూతిని దూరం చేసుకోకుండా ఉండిపోతే బాగుండు ననిపించింది. చటుక్కున ఆమె రెండు చేతులతో ముఖాన్ని కప్పేసుకుంది. వంగినప్పుడు వీపు మీద నుంచి భుజాల మీదుగా కిందికి జారిపోయిన ఆమె నల్లటి జడ మెడ వెనక తెల్లటి భాగాన్ని నగ్నంగా వదిలివేసింది. భుజం మీద కాలుతున్న నా చెయ్యి వేశాను బరువుగా.

నాకు ఎందుకో ఆనందాశ్చర్యాల కంటే, తెలియకుండానే అమూల్యమైన వస్తువులకు స్వామిత్వం వహించినప్పుడు కలిగే ఓ విధమైన గర్వం కలిగింది. అయినా, ఆమెను ఎంతోసేపు చూడలేను. తన హృదయంలో ఏ మూలో నాకు సంబంధించిన భావం ఒకటి దాగి ఉందని ఆ క్షణం వరకూ తోచలేదు.

ఆమె చూపులూ, కళ్ళూ ఎన్నడూ చెప్పలేదు. చెప్పమని నా చూపులూ నిర్బంధించలేదు ఆమె చెప్పినా, వాటిని వెదుక్కుంటూ వెళ్ళి నా చూపులు తన కళ్ళలోకి చొరబడగల వాడిని ఆక్షణం వరకూ ఎన్నడూ సంతరించుకోలేదు.

"నేను గుర్తుంటానా?" చాలా సేపటి తరువాత కంఠంలో ఓ విధమైన మార్పురాగా, అడిగిందామె నా కళ్ళకొసలు తేమబారాయి.

"ఊ — ఎప్పుడూ"

చిన్నగానవ్విందామె "ఏమో, నువ్వు అసలే మతిమరుపు వాడివి" ఆ మాటల్లోని ఆత్మీయత నా కంటికొసల్లో తేమను ఉధృతం చేసింది. సమాధానం చెప్పలేదు "ఒట్టు?" దించుకున్న నా కళ్ళ కిందకు ఆమె తెల్లటి చెయ్యి కనుపించింది స్వల్పంగా కంపిస్తున్న నా చేతి నామె చేతిలో ఉంచాను తొలిసారిగా నా జీవితంలో ఉద్రేకరహితమైన, ఆవేశరహితమైన ఓ అపూర్వ మధురస్పర్శను నా అరచెయ్యి నరాలకంతకూ వ్యాపింపచేసింది వంగి ఆమె తల నిమురుతూ అలాగే ఉండిపోయాను. ఎంతసేపు అలా ఉన్నానో తెలియలేదు. నాకు అరచేతిలో తన వెచ్చటి చేతినలాగే పట్టుకుని తేమబారిన కళ్ళతో, నన్ను నేను విస్మరించి ఉండిపోయాను.

"నే వెళతాను" బొంగురుపోయిన ఆమె కంఠస్వరం విన్నాను నా గొంతు పెగలలేదు చెయ్యి విడదీయలేదు — తీయాలనిపించలేదు వెడుతూ వెనుదిరిగి చూసిన ఆమె చూపులు పూర్తిగా నా గుండెను పుండుచేశాయి అచేతనంగా కూచుండిపోయాను శారద పరాధీన !

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

పెళ్ళి అయిపోయింది ఆమె చూపులూ, రూపూ నా నుంచి దూరం అయిపోయాయి. తరువాత ఎన్నో ఏకాంత ఘడియలలో శారద చూపులూ, మాటలూ దట్టంగా మబ్బులూ మనసును కమ్ముకుని నన్నో వింత బాధకు గురి చేశాయి. నీరు నింపుకొన్న ఆమె పెద్ద కళ్ళూ, ఆమె కంఠం, చూపులూ విపరీతమైన కల్లోలానికి దరిచేశాయి. నన్ను చాలాకాలం నా గుండె, మనసూ, మెదడూ వింత కోరికల బాధను తట్టుకొని నిలబడవలసివచ్చింది. నిజానికి ఆమె నాలో వదిలి, రేపి పారిపోయిన కోరికల బాధను మాత్రమే నేను బహుశా ఎక్కువ అనుభవించి ఉంటాను.

నా మనసు కూడా అవునని సమాధానం తరువాత వినిపించింది.

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

రోజంతా, ముభావంగా, ఏదోగ గడిపాను. మళ్ళీ ఎందుకో నన్నొక్కసారి శారదను ప్రథమంగా చూసిన నాటి స్మృతి బాధించింది. ఆమె మీద అధికారం ఉందనే భావం కలగగానే నా ఆలోచనలూ, భావాలూ మరో మార్గం తొక్కాయి. ఆమె చూడాలన్న కోరిక నన్ను పూర్తిగా స్వాధీనపరుచుకుంది.

ఊరికి ఓ వేపుగా కొత్తగా కట్టిన డాబాల వెనక సూర్యబింబం ధరా గర్భాన్ని కాల్చివేస్తూ ఎర్రగా దిగిపోతోంది. ఓ పక్కన లేత కాటుక రేఖలు మెల్లగా వింత వర్ణాచ్ఛాదితమైన ఆకాశాన్ని ఆక్రమించుకుంటున్నాయి. నీ రెండ మెట్లమీద ఉన్న కుండిల్లో ఏవో ఎర్రటి పూవులమీద అందంగా పడుతోంది. నాకు తెలియని అంతర్గతకంపంతో అనుమానిస్తూ మెట్లెక్కాను. జోళ్ళ శబ్దం వినికాబోలు – "ఎవరూ?" అన్న కంఠం నాకు అతి స్వల్పదూరం నుంచి వినిపించింది. నా గొంతు నుంచి ఇంకా సమాధానం రాకుండానే, ఎవరో లేచిన శబ్ధం వినిపించడం, సున్నితంగా ఎదురుగా ఉన్న ద్వారపు తెరను తొలగించడం వెనువెంటనే జరిగిపోయాయి. స్తంభించిపోయి, హృదయం రెండుమూడు అంగుళాలు కిందకు జారినట్టయి, అవాక్కయి నిలబడిపోయాను.

"శారదా"

"అరె !" ఆమె గొంతు సంభ్రమంగా ధ్వనించింది. అదే స్థితిలో వెళ్ళి కూచున్నాను. తలెత్తి చూశాను. ఆమెలో పెద్ద మార్పేమీ కనిపించలేదు నాకు. కళ్ళనూ చూపులనూ తదేకంగా నా వేపు మరల్చి, మాట్లాడ్డం ఇష్టం లేనట్టుగా ఉన్న ఆమెను చూస్తూ నేనే అన్నాను – "అతనేడీ? "

"డిస్పెన్సరీకి వెళ్ళారు – కులాసాగా ఉన్నావా?" కంఠస్వరంలో మార్పును స్పష్టంగా ప్రదర్శిస్తూ బయటపడ్డాయి మాటలు. ఆప్యాయతనీ, మెత్తదనాన్నీ మనసు వెంటనే పసిగట్టగా, సూటిగా చూస్తూ ఉండిపోయాను.

"నిన్ను చూసి ఎన్ని రోజులయింది." మళ్ళీ ఆమె గుండెలోతుల్లోంచి మార్ధవాన్ని మూటకట్టుకుతెస్తూ, మెల్లగా వెలువడిన మాటలను వింటూ "ఆ" అని మాత్రం అనగలిగాను.

"పిల్లలా ?"

"లేరు. నీకు ?"

"ఇద్దరు."

ఆశ్చర్యంతో ఆమె వేపు చూశాను. పెదవులమీద ఒక్క చిరునవ్వు మినహాయించి, ఆ చూపులలో నాకు మార్పేమీ కనుపించలేదు. మళ్ళీ మెల్లగా అందామె.

"నన్ను గుర్తుంచుకుని వచ్చావు గదూ? "

తలెత్తి చూశాను.

"నయమే. మర్చిపోలేదు."

"శారదా." బొంగురుగా అన్నాను. ఆమె కళ్ళనిండా నీళ్ళు నిండాయి. కనురెప్పలు సున్నితంగా ఆ బిందువులను నున్నని ఆమె బుగ్గల మీదకు నెట్టి వేశాయి. స్వచ్ఛ నీలమణుల్లా మెరుస్తున్న ఆమె కళ్ళు నా చూపులను మరోసారి చెదరగొట్టాయి.

"ఏమిటిలా అయిపోయావు. చిక్కి పోయావు.?"

దిగ్భ్రమతో ఆమెను చూస్తూ ఉండిపోయాను. ఆమె పెదవులు అందంగా, సున్నితంగా చిరునవ్వుతో వంకరలు తిరిగాయి. ఆమె వాడిన ప్రతి మాటా గుండె ఆఖరి పొరనుంచీ, అట్టడుగు మాంస కణాల మధ్య నుంచీ వెలువడి నన్ను వెర్రివాణ్ని చేశాయి. అచేతన స్థితిలో గట్టిగా ఆమె చెయ్యి పట్టుకుని నొక్కుతూ ఉండిపోయాను. కొంచెంగా నవ్వుతూ ఆమె కళ్ళను కిందకు దించుకుంది. ఆమె కనురెప్పలకింద నుంచీ వెచ్చటి రెండు మూడు బాష్ప బిందువులు నా చేతిమీదపడి, నాళాల్లో ప్రసరించే రక్తాన్ని ఉడుకులెత్తించాయి.

"శారదా!" పిలుపు నాకే వికృతంగా వినబడింది. ఆప్యాయంగా నా చెయ్యి అలాగే ఉండిపోయింది. శరీరం హఠాత్తుగా నన్ను విస్మరించింది. చటుక్కున ఆమెను దగ్గిరగా లాక్కుని పెదవుల మీద బలంగా ముద్దు పెట్టుకున్నాను. సరిగ్గా ఏమైందో నా జ్ఞానేంద్రియాలు తెలుసుకునే స్థితిలో లేవు. కానీ కొన్ని క్షణాల తరువాత, ఆమె ముఖంమీదకు దాడిచేసే నా పెదవులు కొంచెంగా చిట్లి, నేను లేచిన సోఫా మీదకు పడ్డాను.

ఒక్కసారి స్పృహలోకి వచ్చి చూశాను ఎదురుగా. స్మృతి హీనలాగ, నిశ్చేష్టురాలై, పెదవులు గజగజ వణుకూతూండగా శారద అలాగే నన్ను చూస్తూ నించుండిపోయింది. నా చూపులు మళ్ళీ ఆమె ముఖంలోకి ప్రసరించాయి. ఆమె పెద్ద కళ్ళలో నేను గమనించిన కాంతి కరిగిపోయింది. ముఖం రక్తారుణిమను పుంజుకుంది. మరోసారి చూశాను. ఆమె చటుక్కున లేచి నిలుచుంది. మైల పడినట్టుగా, అపవిత్రమైనట్టుగా, శరీరాన్ని కొంగుతో కప్పుకుంటూ అందామె.

"సారధీ"

"ఏ ఆప్యాయతా, కోపం, బాధా ధ్వనించలేదా పిలుపులో. మాంస, రక్త రహితమైన స్వరపేటిక ఉచ్చరించిన మూడు పొడి మాటలు నా చెవులను తాకాయి. ఆమె వేపు చూశాను. ఆ క్షణంలో ఆమె చూపులు వ్యక్తం చేసిన భావన గుండెను ఫెళ్ళున బద్దలు చేస్తుందని భయపడ్డాను. నా మనసూ, శరీరం దిగజారిపోయిన నీచమైన లోతులను, అసహ్యకరమైన పరిధులూ హఠాత్తుగా స్ఫురించాయి నాకు. మహాపాపి మనసులా – తలవంచుకు కూచున్న నన్ను ఆమె చూపులు కణకణాన్నీ కాల్చి మసి చేస్తున్నాయి. నా గుండె నెర్రెలు తీసినట్టయింది. ఆ క్షణంలో నన్ను తను శపించినా బాగుండుననిపించింది. అచేతనంగా, చల్లబడిన శరీరంతో, తల భూమిలోకి దించుకుని ఒకే ఒక్క అడుగుతో చూపులు మరల్చకుండా బయటపడ్డాను.

★ ★ ★ ★ ★ ★ ★ ★

COMMENTS